## ₹425 కోట్లు యూపీఎస్సీకి

UPPSC

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఈ ఏడాది బడ్జెట్‌లో మొత్తం రూ.425.71 కోట్లను కేటాయించారు. అందులో 208.99 కోట్లను సిబ్బంది వేతనాలు, అలవెన్స్‌లకు కేటాయించగా మిగిలిన 216.72 కోట్లను సివిల్ సర్వెంట్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు ఇచ్చారు.

# బడ్జెట్ 2024-25

కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడును పూర్తిగా విస్మరించారు. మోదీ సర్కారు తీరుకు నిరసనగా ఈ నెల 27న ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నా. కేంద్ర బడ్జెట్‌పై డీఎంకే ఎంపీలు ఈ నెల 24న ఢిల్లీలో నిరసన వ్యక్తం చేస్తారు. తమిళనాడు హక్కులను పరిరక్షించుకునేందుకు ప్రజాకోర్టులోనే పోరాడుతాం. లోక్‌సభలో తగినంత సంఖ్యాబలం లేని 'మైనార్టీ బీజేపీ'ని 'మెజార్టీ బీజేపీ'గా మార్చిన కొన్ని ప్రాంతీయ పార్టీలను సంతృప్తి పరిచేందుకు బడ్జెట్‌లో కేవలం కొన్ని రాష్ట్రాలకే పథకాలను ప్రకటించారు. -తమిళనాడు సీఎం స్టాలిన్

## నీతిఆయోగ్ భేటీకి 4 రాష్ట్రాల సీఎంల బాయ్‌కాట్

న్యూఢిల్లీ, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో విపక్ష రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో సవతి ప్రేమ చూపిన మోదీ ప్రభుత్వ వైఖరిపై ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 27న ప్రధాని అధ్యక్షతన జరిగే నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు కారాదని నలుగురు సీఎంలు నిర్ణయించారు. ఇందులో ముగ్గురు కాంగ్రెస్ సీఎంలు ఉన్నారు. తాము నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ మంగళవారం సాయంత్రం ప్రకటించగా, బడ్జెట్‌లో ప్రతిపక్ష రాష్ట్రాలపై మోదీ చూపిన వివక్షపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తమ పార్టీ ముఖ్యమంత్రులు ముగ్గురు ఈ సమావేశానికి హాజరు కారని స్పష్టం చేశారు. కాగా, బడ్జెట్‌లో కేంద్రం చూపిన వైఖరిపై బెంగాల్, కేరళ ముఖ్యమంత్రులు ఆగ్రహం వ్యక్తం చేసినా, వారు నీతి ఆయోగ్ సమావేశం గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు.

## దేశవ్యాప్తంగా 10-15 ఈ-కామర్స్ హబ్‌లు

న్యూఢిల్లీ, జూలై 23: చిన్న ఉత్పత్తిదారుల ఎగుమతుల్ని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా 10-15 హబ్‌లను ఏర్పాటుచేయబోతున్నట్టు కేంద్రం ప్రకటించింది. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో (పీపీపీ) ఈ-కామర్స్ మాధ్యమంలో వీటిని తీసుకొస్తున్నట్టు తెలిపింది. వాణిజ్యం, ఎగుమతి సంబంధిత సేవల్ని ఒక గొడుగు(హబ్స్) కిందకు తీసుకొస్తున్నట్టు మంగళవారం నిర్మల వెల్లడించారు.

# కేసీఆర్ మాటే నిజమైంది

- వినిపించుకోని ఫలితం ఏంటో తేలిపోయింది
- బీఆర్ఎస్‌కు 10-12 ఎంపీలు ఇస్తే ఇలా జరిగేదా?
- సంకీర్ణ సర్కార్‌లో ప్రాంతీయ పార్టీలదే హవా
- ఆంధ్రా, బీహార్‌కు నిధులు, ప్యాకేజీల వరద
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

**తెలంగాణకు ప్రధాని మోదీ మొండిచేయి**

*లోక్‌సభ ఎన్నికల అనంతరం కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇది దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్‌కు 10-12 ఎంపీ సీట్లు ఇస్తే, ఢిల్లీలో సత్తా చాటి తెలంగాణ ప్రయోజనాలు కాపాడుకుంటూ, అవసరమైన వాటిని సాధించుకొస్తా.*

*-పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ (మే 7, 2024, నిజామాబాద్.)*

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): 'నా ఘర్ కే నా ఘాట్ కే' అనేది హిందీ సామెత. తెలుగులో దీని అర్థం 'రెంటికి చెడ్డ రేవడి' అని. కేంద్ర బడ్జెట్ చూశాక తెలంగాణ పరిస్థితి అచ్చంగా అలానే తయారైంది. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వం అవసరం అని పదే పదే తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎందుకంటారన్నదానికి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఎదురైన దుస్థితి అద్దం పడుతున్నది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఏమి జరుగబోతున్నదో కేసీఆర్ ముందే ఉహించారు. బీఆర్ఎస్ పార్టీ ఎక్కువ ఎంపీ సీట్లు ఎందుకు గెలువాలో విడమరిచి చెప్పారు. అయినా వినిపించుకోకపోతే దాని ఫలితాలు ఎలా ఉంటాయన్నదానికి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పట్ల కనబరిచిన వివక్ష, జరిగిన అన్యాయమే నిదర్శనం. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కేసీఆర్ ఎమన్నారో ఒకసారి గుర్తు చేసుకుంటే.. 'లోక్‌సభ ఎన్నికల అనంతరం కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇది దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్‌కు 10-12 ఎంపీ సీట్లు ఇస్తే, ఢిల్లీలో సత్తా చాటి తెలంగాణ ప్రయోజనాలు కాపాడుకుంటూ, అవసరమైన వాటిని సాధించుకుందాం' అని చిలుకకు చెప్పినట్టు చెప్పారు. అయినా ప్రజలు వినిపించుకోకుంటే ఎలాంటి పరిస్థితులను చవి చూడాల్సి వస్తుందో అన్నదానికి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయమే నిదర్శనం. కేసీఆర్ చెప్పినట్టు 10-12 ఎంపీ సీట్లు బీఆర్ఎస్‌కు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేదా? అని ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన తరుణం వచ్చిందని తెలంగాణవాదులు గుర్తు చేస్తున్నారు.

### ఆంధ్రా, బీహార్ పట్ల మెహర్బాని

పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ సర్కార్‌కు తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంతటి మెజార్టీ సీట్లు రాని కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని టీడీపీ, బీహార్‌లో నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూ పార్టీ ఎంపీల మద్దతు అనివార్యం అయింది. ఈ రెండు పార్టీల మద్దతుపైనే కేంద్ర ప్రభుత్వ మనుగడ ఆధారపడి ఉన్నది. ఈ బలహీనత కారణంగానే ఆంధ్రా, బీహార్ రాష్ట్రాలకు కేంద్రం తన బడ్జెట్‌లో భారీగా నిధులు, అభివృద్ధి ప్యాకేజీలను ప్రకటించింది. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల సాయానికి హామీ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన నిధులు సమకూర్చుతామన్న హామీతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ తదితర లక్షల కోట్ల విలువ చేసే పలు ప్రాజెక్టులను ప్రకటించింది. బీహార్‌కు రూ. 26 వేల కోట్ల ప్రాజెక్టులతో పాటు వందలాది కోట్ల విలువ చేసే ప్యాకేజీలను ప్రకటించింది.

### అప్పుడు టీడీపీ-ఇప్పుడు బీజేపీ

ఉమ్మడి ఏపీలో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో తెలంగాణ పదాన్ని ఉచ్చరించవద్దని అప్పటి స్పీకర్ యనమల రామకృష్ణుడు నిషేధం విధిస్తే, ఇప్పుడు ఇదే టీడీపీ మద్దతుతో కేంద్రంలో కొనసాగుతోన్న ఎన్డీయే ప్రభుత్వం తన బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పదాన్ని నిషేధించడం కాకతాళీయంగా జరిగిందా? లేక ఉద్దేశపూర్వకంగా జరిగిందా? అనేది రాజకీయ వర్గాలు, తెలంగాణ సమాజంలో చర్చకు దారితీసింది. ఏపీకి మాత్రమే విభజన హామీలను నెరవేరుస్తామని కేంద్రం నిస్సిగ్గుగా ప్రకటించినప్పటికీ తెలంగాణకు చెందిన 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు నోరు మెదపక పోవడంపై తెలంగాణ భగ్గుమంటుంది.

## కాంగ్రెస్, బీజేపీకి చెరో ఎనిమిది సీట్లిచ్చినా ఫాయిదా లేదు..

**కేంద్రంలో** సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని కేసీఆర్ ముందుగా అంచనా వేసి చెప్పినట్టుగా బీఆర్ఎస్ 10 నుంచి 12 ఎంపీ సీట్లు గెలిచి ఉంటే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పంట పండి ఉండేదని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెరి సమానంగా 8 ఎంపీ సీట్లు గెలిపించినా నయా పైసా ఫాయిదా లేకుండా పోయింది. ఇక్కడి నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నా ప్రయోజనం లేకుండా పోయింది. బీజేపీ పెద్దల దృష్టిలో ఇక్కడి ఎంపీలు, కేంద్ర మంత్రుల పరిస్థితి 'ఘర్ కా ముర్గీ దాల్ కా బరాబర్' (ఇంటి కోడి పప్పుతో సమానం) అన్నట్టు ఉంది. ఇక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని గట్టిగా అడగలేని స్థితిని తెచ్చిపెట్టుకుంది. రేవంత్‌రెడ్డి సీఎం అయి ఉండీ ప్రధాని మోదీని 'బడే భాయ్' అంటూ సాగిలబడడంతో చులకన అయిపోయారన్న విమర్శ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నది. అప్పటి నుంచే తెలంగాణకు ఏం కావాలో అధికార కాంగ్రెస్ పారీ గట్టిగా డిమాండ్ చేయలేని పరిస్థితికి నెట్టివేయబడిందని రాజకీయ పరిశీలకుల అభిప్రాయపడుతున్నారు.

## ..16 ఎంపీలిస్తే ఏం ఒరిగింది?

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ తెలుగు కోడలు నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో తెలంగాణకు ఏమైనా నిధులు కేటాయిస్తారని ఆశించామని, కానీ రాష్ట్రానికి దక్కింది శూన్యమని పెదవి విరిచారు. రూ.48.21 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టినా కొన్ని రాష్ట్రాలకే పెద్ద పీట వేశారని విమర్శించారు. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావనే లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో దాదాపు 35 హామీలపైన నిర్ణయం తీసుకోవాలని గతంలో కేంద్రానికి కేసీఆర్ విజ్ఞప్తి చేశారని, అనేకసార్లు లేఖలు రాశామని గుర్తుచేశారు. ములుగు గిరిజన యూనివర్సిటీకి అదనపు నిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదని చెప్పారు.

### జాతీయ హోదాపై పట్టించుకోలే

రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని ఎన్నిసార్లు అడిగినా కేంద్రం పట్టించుకోలేపటం లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐఐఎం సహా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వంటి కేంద్ర జాతీయ సంస్థలు ఇవ్వాలని కోరినా ఒక్కటీ నెరవేర్చలేదని, తెలంగాణ నుంచి ముంబై - నాగపూర్, బెంగళూరు- చెన్నై వంటి మార్గాల్లో పారిశ్రామిక కారిడార్లకు నిధులు అడిగినా స్పందన లేదని, మెగా పవర్ లూమ్ క్లస్టర్‌తో పాటు కొత్త హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అడిగినా పట్టించుకోలేదని మండిపడ్డారు.

### ప్రాంతీయ శక్తుల బలోపేతం అవసరం

బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, బీహార్‌కు అధిక నిధులు కేటాయించారని, ఎందుకు ప్రాంతీయ శక్తులను బలోపేతం చేసుకోవాలో ఈ బడ్జెట్ ద్వారా అర్థం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పార్లమెంట్‌లో రాష్ట్ర బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎంపీలు ఉండి ఉంటే కేంద్ర వైఖరిని నిలదీసేవారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు ఇచ్చినందుకు బాధలేదని, సోదర రాష్ట్రంగా వారు బాగుండాలని కోరుకుంటున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం పేరు చెప్పినా ఎక్కడా తెలంగాణ ఆనే పదం ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు.

## తెలంగాణకు న్యాయం చేస్తారన్ననమ్మకం లేదు

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం చేస్తారన్న నమ్మకం లేదని మంగళవారం ఉదయమే కేటీఆర్ చెప్పారు. ఈ సారి బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు ఎలా ఉంటాయని ఓ జర్నలిస్ట్ అడుగగా కేటీఆర్ 'ఈ సారి కూడా కేంద్ర బడ్జెట్‌లో అదే పరిస్థితి ఉంటుంది. మళ్లీ కేటాయింపులు సున్నానే అని సమాధానమిచ్చారు. కేంద్రంలో గెలిచే పార్టీకి ఓటేస్తే రాష్ట్రానికి మంచి జరుగుతుందని భావించే బీజేపీకి 8 సీట్లు ఇచ్చారని చెప్పారు. 'ఈ ప్రాంత ప్రజల కోసం బీజేపీ ఎంపీలు మోదీతో మాట్లాడి ఏం మేలు జరిగేలా చేస్తారో వేచి చూడాలి. ఎప్పటిలాగే తెలంగాణకు ఈ బడ్జెట్‌లో గుండుసున్నానే' అని ఎద్దేవాచేశారు.

## బడ్జెట్‌లో తెలంగాణ పదాన్నే ఉచ్ఛరించలే

- మన ప్రాజెక్టులకు జాతీయ హోదా ఏది?
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

హైదరాబాద్, జూలై 23(నమస్తే తెలంగాణ) : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ఏపీకి భారీగా నిధులు కేటాయించినా, తెలంగాణ పదాన్ని కూడా ఉచ్ఛరించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. 'ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి ఏటా రూ.15 వేల కోట్లు కేటాయిస్తామన్నారు. శ్రీకాకుళం-చెన్నై కారిడార్‌ను ప్రస్తావించారు. తెలంగాణ విషయంలో హైదరాబాద్-బెంగుళూరు కారిడార్ ప్రస్తావించినా ఇందులో 150 కిలోమీటర్లు మాత్రమే తెలంగాణలో ఉంటుంది. మిగతాదంతా ఏపీలోని రాయలసీమ ప్రాంతంలో ఉంటుంది. ఒకవేళ తెలంగాణకు ఏదైనా ప్రాజక్టు ఇవ్వాలనుకుంటే హైదరాబాద్-నాగపూర్ కారిడార్ ప్రకటిస్తే బాగుండేది. దీనివల్ల యావత్ తెలంగాణకు, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రాంతానికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది' అని అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజక్టుకు జాతీయ హోదా ఇవ్వడంతోపాటు ఏపీకి మరింత సహకారం అందిస్తామని చెప్పారని, తెలంగాణలో గోదావరి, కృష్ణా నదులపై జాతీయ ప్రాజక్టుల నిర్మాణానికి చాలా కాలంగా చేస్తున్న డిమాండ్‌ను ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దురదృష్టకరమని వాపోయారు. ఏపీ, బీహార్‌లకు అత్యధికంగా కేటాయింపులు జరపడం స్పష్టంగా కనిపిస్తున్నదని చెప్పారు. పునర్విభజన చట్టంలో పొందుపరిచిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం, ఐఐఎం, నవోదయ విద్యాలయాలు, జాతీయ ప్రాజక్టులను కాంగ్రెస్, బీజేపీ సభ్యులు బడ్జెట్ చర్చ సందర్భంగా పట్టుబట్టి సాధించుకోవాలని కోరారు. తమ పార్టీ ఎంపీలు గతంలో పోరాడి కొన్ని సాధించగా, ఇంకా సాధించాల్సినవి ఉన్నాయని వివరించారు.

# దెబ్బకు దెయ్యం దిగివచ్చింది!

- పార్లమెంట్ ఎన్నికల్లో భంగపాటుతో అన్ని వర్గాలకు బడ్జెట్‌లో బీజేపీ పెద్దపీట
- విస్మరించిన వర్గాలకు ప్రాధాన్యం



పార్లమెంటులో బడ్జెట్ ప్రసంగం చదువుతున్న నిర్మలాసీతారామన్

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా తిరిగి అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల ముందు తాయిలాలు ప్రకటించడం సర్వసాధారణం. కానీ, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇందుకు భిన్నంగా ఎన్నికల తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వరాలు ప్రకటించడం అన్ని వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఇలా ఎందుకు చేసింది? అన్నదాంట్లో పెద్దగా అర్థం కాని బ్రహ్మపదార్థం ఏమీ లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి దేశవ్యాప్తంగా ఉహించని షాక్ తగలడంతో ఇంతకాలం తాము విస్మరించి, నిర్లక్ష్యం చేసిన వర్గాలకు దగ్గర కావడానికి చేసిన ప్రయత్నంగా రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మత రాజకీయాలతో ఎల్లకాలం నెట్టుకురావడం కష్టమేనని పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు చాటిచెప్పడంతో బీజేపీకి కనువిప్పు కలిగి ఉంటుందని విశ్లేషిస్తున్నారు. నల్ల చట్టాలు, వ్యవసాయ వ్యతిరేక విధానాలతో రైతులు, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పడంతో నిరుద్యోగ యువత, ఇంతకాలం విస్మరించిన వేతన జీవులు తదితర వర్గాలు దూరం కావడం వల్లనే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చాయని బీజేపీ ఎట్టకేలకు గ్రహించిందని చెప్తున్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలకు తాజాగా మంగళవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు మధ్య తేడా స్పష్టంగా కనిపించిందనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఆ పార్టీని ఎంతగా కలవరపాటుకు గురిచేశాయో ప్రస్తుత బడ్జెట్‌లో ప్రకటించిన అనేక రాయితీలు, తాయిలాలు చెప్పకనే చెప్తున్నాయని అంటున్నారు.

### కనువిప్పుతో బిడ్డుబాటు చర్యలు

వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం కల్పిస్తూ రైతులు పండించే పంటలకు మద్దతు ధర కల్పిస్తామన్న హామీ, నూనె గింజలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి పెంపుదలకు కృషి చేస్తామని ప్రకటించడం, ప్రధాన మంత్రి అన్న యోజన గడువు మరో ఐదేండ్ల పొడిగింపు చర్యలతో రైతాంగంలో కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి కల్పించేందుకు పూనుకున్నదన్న సంకేతాలను కేంద్రం ఇచ్చిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో విస్మరించిన వర్గాలలో యువత ఒకటి. ఈ విషయాన్ని కేంద్రం గ్రహించినట్టు ఉంది. కోటి మంది యువతకు ఉద్యోగాల కల్పన, విద్యా, ఉపాధి నైపుణ్యానికి బడ్జెట్‌లో రూ. 1.48 లక్షల కోట్లు ప్రకటించడంతో పాటు 4 కోట్ల మంది యువత కోసం రెండేండ్ల వ్యవధికి రూ. 2 లక్షల కోట్లు కేటాయిస్తూ ఐదు ప్రత్యేక పథకాలను ప్రకటించింది. కొత్త ఉద్యోగాల కల్పనలో భాగంగా మొదటి నెల వేతనాన్ని ప్రభుత్వమే చెల్లించనున్నట్టు ప్రకటించింది. అలాగే ఇంతకాలంగా విస్మరించిన వేతన జీవులకు ఆదాయ పన్ను లెక్కింపులో స్వల్ప ఊరట కల్పిస్తూ, రూ. 3 లక్షల ఆదాయం వరకు జీరో ట్యాక్స్, స్టాండర్డ్ డిడక్షన్ 50 నుంచి 75 వేలకు పెంచింది.

## తెలంగాణలో వెనుకబడిన జిల్లాలు లేవా?

- పాలమూరు రంగారెడ్డికి జాతీయహోదా ఎందుకివ్వలే?
- బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం: హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ) : కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ అనే పదాన్నే ఉచ్ఛరించలేదని, కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ ఏపీలోని వెనకబడిన జిల్లాల గురించి కేంద్ర బడ్జెట్‌లో మాట్లాడారని, తెలంగాణలో వెనుకబడిన జిల్లాలు లేవా? అని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఎందుకు ఇవ్వలేదని? రాష్ట్రంలో ఇద్దరు బీజేపీ మంత్రులు ఉండీ ఏం చేస్తున్నారని నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి ఏం ప్రయోజనమో చెప్పాలని మండిపడ్డారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ప్రస్తావన ఎందుకు లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చింది గుండుసున్నా అని తీవ్రంగా విమర్శించారు.

## బడేభాయ్.. చోటేభాయ్.. తెలంగాణ గరీబ్

- విభజన చట్టం రెండు రాష్ట్రాలకు వర్తించదా?
- బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): బడేభాయ్.. చోటేభాయ్ తెలంగాణను గరీబ్‌ను చేశారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర బడ్జెట్ సహకార, సమాఖ్య స్ఫూర్తిని కాకుండా సంకీర్ణ ప్రభుత్వ స్థిరత్వానికి సహకరించే బడ్జెట్‌గా ఉన్నదని అభివర్ణించారు. విభజన చట్టం అంటే ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించే కాదని, అందులో తెలంగాణ కూడా ఉన్నదనే విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి విస్మరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల్లో ఒక్కదానికైనా జాతీయ హోదా కల్పించాలని కేసీఆర్ కేంద్రాన్ని కోరినా పెడచెవిన పెట్టిందన్నారు.

### తెలంగాణపై వివక్ష

**రాష్ట్రానికి** చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా బీజేపీ ఎంపీలు కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తగిన వాటాను పొందడంలో విఫలమైండ్రు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డిలలో దేనికీ జాతీయ హోదా ఇవ్వకుండా కేంద్రం వివక్ష చూపించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో తెలంగాణకు సంబంధించిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదు. బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించినట్టు కనిపించలేదు.

**- కొప్పుల ఈశ్వర్, మాజీ మంత్రి**

### ఆ ఎంపీలతో ఏం లాభం?

**బీజేపీ** ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చింది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఆంధ్ర, బీహార్‌కు బడ్జెట్లో వరాలు కురిపించింది. తెలంగాణలో 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి ఏం లాభం?. తెలంగాణ అస్తిత్వం ఉన్న బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలనే విషయంపై ప్రజలు ఆలోచించాలి. ప్రాంతీయ పార్టీలతో పొత్తుపెట్టుకుని జాతీ య పార్టీలు అధికారంలోకి వస్తున్నయ్. ఆ ఎంపీలు కొట్లాడి నిధులు తెస్తరు. తెలంగాణ సోయి ఉన్న బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ఉండాలని మొత్తుకున్నం.

**- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి**

### విబేధాలు పెంచేలా ..

**తెలంగాణ,** ఏపీ మధ్య విబేధాలు పెంచేలా బడ్జెట్ కేటాయింపులు చేయడం అన్యాయం. ఏపీ రాజధానికి రూ.15వేల కోట్లు, ఇండస్ట్రియల్ కారిడార్, రాయలసీమ, ఉత్తరాంధ్ర, పోలవరం ప్రాజెక్టుకు కేటాయింపులు సంతోషమే! విభజన చట్టం ప్రకారం తెలంగాణలో ఒక్కదాన్ని కూడా పూర్తి చేయకపోవడం మోదీ పార్శ్వదృష్టికి నిదర్శనం. బయ్యారం స్టీల్ , కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుకు నిధులివ్వాలి.

**- కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు**

### తెలంగాణకు అన్యాయం

**కేంద్ర** ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు రూపాయి కూడా కేటాయించకుండా మోసం చేశారు. బీజేపీని నమ్మి తెలంగాణ ప్రజలు 8ఎంపీ సీట్లు గెలిపిస్తే ప్రధాని మోదీ తీరని అన్యాయం చేశారు. ఆంధ్ర, బీహార్‌కు ప్యాకేజీలు ఇచ్చి తెలంగాణకు ఎందుకు మొండిచెయ్యి చూపారో చెప్పాలి. పెన్షన్లు, ఆదాయ పన్ను స్లాబ్ రేట్లు తూతూ మంత్రంగా ప్రవేశపెట్టినా పెరిగిన ధరల నుంచి ఉపశమనమార్గాలు చూపలేదు. సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు. రానున్న రోజుల్లో ప్రజలు బీజేపీకి గుణపాఠం చెబుతారు.

**- చాడ వెంకటరెడ్డి, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు**

### ఎంపీలు చేసిందేమిటి?

**బడ్జెట్‌లో** తెలంగాణపై కేంద్రం తీవ్ర వివక్ష చూపింది. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు నిధులు తేవడంలో విఫలమయ్యారు. 'దేశంలో ఏర్పడేది సంకీర్ణ ప్రభుత్వమే.. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నిధులు అవే వస్తయ్' అన్న కేసీఆర్ మాటలు అక్షర సత్యమని కేంద్ర బడ్జెట్ రుజువుచేసింది. కేంద్రం తెలంగాణకు నయా పైసా ఇవ్వకుంటే పార్లమెంట్లో కూర్చున్న బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఏం చేస్తున్నట్టు? అదే బీఆర్ఎస్ ఎంపీలు ఉండి ఉంటే కేంద్ర వైఖరిని నిలదీసేవారు.

**-మేడె రాజీవ్